# అర్థం

రంగనాథం అసలే మొహమాటస్థుడు. వ్యాపారానికి పనికిరాడు. అయినా అంతకంటే ఇంకేం మార్గంలేదు గనుక ప్రింటింగ్ ప్రెస్ యజమాన్యం తీసుకోవలసి వచ్చింది. ప్రింటింగ్ ప్రెస్ అతని మామగారిది. ఆయనకు ఒకే ఒక్క కూతురు. ఆయనగారు పరలోకానికి వెళ్లిపోవడంతో ప్రెస్‌ను దక్షతతో నడపవలసిన ఆసామీ అవసరం అయ్యాడు. పనివాళ్లు ఆఫీస్ స్టాఫ్ వుంటారు గాని, యజమాన్ని, తానూ అంటూ ప్రెస్ ఆవరణలో కూచోకపోతే పనులు జరగవుగదా?

నిజానికి రంగనాథం కంటె అతని భార్య కమల దక్షత అయిన మనిషి. తండ్రిగారి హాయాంలో వ్యాపారపు మెలుకువలు కొన్ని తెలుసుకుంది. భర్తను ప్రింటింగ్ ప్రెస్ నిర్వహించమని ప్రోత్సహించి సమయానుకూలంగా తను సలహాలు ఇస్తూ వుంటానని వాగ్దానం చేసింది.

ఆరు నెలలు గడిచి లెక్కలు చూసుకొనేటప్పటికి పరిస్థితులు యేమీ అనుకూలంగా కనిపించలేదు. ఇలాగే జరిగేట్టయితే ప్రెస్ మూతపడడానికి ఇంకెన్నో నెలలు అక్కర్లేదు.

"నిజాయితీగా వుండడం మంచిదే! కాదనను. కాని ఆ నిజాయితీ ఒక్కటే మన కడుపులు నింపదు గదా!" అన్నది కమల.

"నన్నేం చేయమంటావు. నాకు ఈ లెక్కలు డొక్కలు తెలియవని ముందే చెప్పానుగా..."

"లెక్కల్లో యేముందండీ, మనబుర్రల్లో వుండాలిగాని. నామాట విని పైవారం టెండర్లు ఓపెన్ చేస్తారే ఆ గోవిందరాజులుగారు - ఆయన్ను కాస్త మంచిచేసుకోండి?" అంది కమల.

మంచిచేసుకోవడం అంటే నాలుగయిదు సార్లు వాళ్ళ ఇంటిచుట్టూ తిరగడం వాళ్ళను భోజనాలకు పిలవడం, కవర్లలో పెట్టి కరెన్సీ నోట్లు అందించ

డమూను! రంగనాథానికి ఇవేవీ ఇష్టం లేదు. "టెండరు" పెట్టాం వస్తే పనిచేస్తాం. లేక పోతే లేదు అంటాడు. "మరీ అంత మడికట్టుకుకూర్చుంటే మన్ను తినిపోతాం" అంటుంది కమల. ఎలాగయితేనేం గోవింద రాజులుగారిని చూచాడు రంగనాథం. ఆయన మర్యాదగా మాట్లాడి "అలాగే చూద్దాం లెండి టెండరు ఓపెన్ చెయ్యనివ్వండి" అన్నాడు. కమల ఈ సమాచారం విన్నాక ఊరికే వుండలేకపోయింది. "మొత్తం లక్షయాభై వేల రూపాయలపని. ఆయన ఈ అర్డరు ఇచ్చాడంటే దీంట్లో కనీసం యాభై వేలయినా మిగిలుతాయంటు న్నారు గదా? ఇంకా – చూస్తూ కూర్చుంటారేం, ఏమయినా చేయండి" అని రంగనాథాన్ని హడావిడి పెట్టింది.

"ఇంకేం చేయాలంటావు!" అన్నాడు రంగనాథం అమాయకంగా ముఖంపెట్టి.

"గోవిందరాజులు గారిని ఆయన భార్యను భోజనానికి పిలుద్దాం, రేపు ఆది వారంనాడు" అంది కమల.

దాన్లో ఏమీ ప్రమాదం కనిపించలేదు రంగనాథానికి.

దంపతులు ఇద్దరూ వెళ్ళి ఆహ్వానించి వచ్చారు.

"అలాగే, తప్పకుండా వస్తాం" అన్నారు గోవిందరాజులు ఆయన భార్య శకుంతలాదేవీని.

అన్నప్రకారం వచ్చారుకూడా.

"గోవిందరాజులుగారు పిలవగానే రావడమే మన అదృష్టం. సగం పని అయి పోయినట్టే" అని మనసులోనే సంబరపడి పోయింది కమల.

శకుంతలాదేవి, కమలా చాలా సేపు కబుర్లు చెప్పకున్నారు.

భోజనాలు అయిన తర్వాత వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

తీరుబడిగా రంగనాథాన్ని అడిగింది "ఏమన్నారు ఆయన" అని.

"ఏ విషయం?"

"రెడ్డొచ్చాదు – మొదలాడర అన్నట్టుంది మీ విషయం. అదే మన టెండర్ విషయమండీ" అని నోరు నొక్కుకుంటూ చెప్పింది కమల.

"అ విషయం నేనేం మాట్లాడలేదు. లోకాభిరామాయణం కబుర్లు చెప్ప కున్నాం గంటసేపూను" – అన్నాడు రంగనాథం.

కమలకు ఏమనడానికి నోరు రాలేదు.

ఎక్కువగా చిరాకు ప్రదర్శించినా, రంగనాథం "నాకేం తెలియదు ఈఊబిలో

నీవే నన్నుదించావు. నేనికమీదట ప్రెస్ వ్యవహారాలు పట్టించుకోనే పట్టించుకోను" అని తాళం చెవులు తన ముఖాన గిరవాటు పెడతాడేమోనని భయం.

మరునాడు రంగనాథాన్ని వెంటబెట్టుకుని కమల గోవిందరాజుగారి ఇంటికి వెళ్ళింది.

అయన ఇంట్లో లేరు. తలుపు తీస్తూనే శకుంతలాదేవి ముఖంనిండా నవ్వు పూసుకుని ఇద్దరినీ అయన ఆఫీసురూంకు తీసుకుపోయి కూర్చోబెట్టింది.

'ఉభయకుశలోపరి' మాట్లాడుకున్నారు.

యాధాలాపంగా అన్నట్లుగా టేబుల్ మీద ఫైలు ఒకటి రంగనాథం ముందు పడవేసింది ఆమె.

"దక్షిణ భారతదేశ చరిత్ర – ముద్రణకు టెండర్లు" అని ఆ ఫైలు కవర్ మీద వ్రాసి వుంది.

రంగనాథం కళ్లు జిగేలుమన్నాయి. తను కొటేషన్ పంపించింది ఈ టెండర్‌కు జవాబుగానే.

కమల అతని ముఖంలోని ఉత్సాహాన్ని గమనించి కాస్త కుదుటబడింది.

"కాగితాలు తీసి చూడండి. ఫరవాలేదు" అన్నట్లుగా అతనికి సైగ చేసింది.

అయినా రంగనాథం సంకోచంగానే వున్నాడు.

శకుంతలాదేవి ఏదో మిషమీద లోపలకు వెళ్ళిపోయింది.

"ఆఫైల్ చూడమనే ఆమె ఉద్దేశ్యం. అందుకే మీముందుకు తోసింది. చూడండి లోపల యేముందో... " అని కమల తొందర చేసింది. శకుంతలాదేవి ఎదురుగుండా లేదుకదా– ఫరవాలేదులే అని భరోసాగా ఫైలు పుటలు తిప్పాడు.

'దక్షిణ భారతదేశ చరిత్ర' బృహత్ గ్రంథం అచ్చువేయించడానికి 'టెండర్లు' పిలుస్తున్న నోటిఫికేషన్ కనిపించింది. తర్వాత ప్రెస్‌లనుంచి వచ్చిన టెండర్లు ఒకదాని కింద మరొటి పేర్చి వున్నాయి. ఎక్కువ శ్రమపడనక్కరలేకుండానే అన్ని 'కొటేషన్లు' ఒక కాగితం మీద చేర్చి తయారు చేసిన 'కంపారటివ్ స్టేట్‌మెంట్' కనిపించింది రంగనాథానికి. అందులో తన ప్రెస్ పేరుకు ఎదురుగా తను కోట్ చేసిన అంకె వ్రాసివుంది. 'రిమార్క్' కాలంలో ఇదే తక్కువ కొటేషన్ అన్నిటికన్నా అని కూడా వ్రాసి వుంది.

రంగనాథానికి మంచి 'ఉత్సాహం' అనిపించింది ఈ "రిమార్కు" చూచాక తప్పని సరిగా తనకే ఈ "ఆర్డర్" వచ్చేస్తుంది.

"ఎంత హీనంగా చూచుకున్నా యాభైవేల రూపాయల నికరలాభం కళ్ళ చూడవచ్చును. ఈ సంవత్సరంలో పోయిన సంవత్సరం నష్టం కొంత పూడ డమే కాకుండా కొత్త నష్టం రాకుండా జాగ్రత్త పడవచ్చును" అనుకున్నాడు రంగనాథం.

శకుంతలాదేవి తిరిగొచ్చింది.

కాఫీలు తాగి సెలవుతీసుకుందాం అనుకుంటూవుండగా ఆమె అంది "నిన్న వారు చెబుతున్నారు మీ టెండరు సంగతి. నాకు వివరాలు తెలియవనుకోండి అయినా" అంటూ మధ్యలో ఆపివేసింది.

కమల, రంగనాథం మళ్ళీ కూర్చుండి పోయారు.

"గోవిందరాజులుగారు ప్రామిస్ చేశారు, ఈ టెండర్ మాకిస్తామని" అంది కమల, "మీరుకూడా చెప్పండి" అని రంగనాథాన్ని మోచేత్తో పొడుస్తూ.

"అవునండీ. నేను వారిని కలుసుకున్నాను..."

శకుంతలాదేవీ వెంటనే అందుకుంటూ "వారికి కూడా మీకే ఇవ్వాలని వుంది, కాని ఇందులో ఒక చిన్న కిటుకు అట్టే వుండిపోయింది" అంది.

"ఏమిటండీ అది?"

"పుస్తకాల ముద్రణలో పూర్వానుభవం వున్నవాళ్ళకు మాత్రమే ఈ వర్క్ ఎలాట్ చేయాలని బోర్డ్ అఫ్ డైరెక్టర్స్ ఉద్దేశ్యమట. గోవిందరాజుగారు అందుకే తటపటాయిస్తున్నారు."

"సందేహం అక్కర్లేదండి. మాకు యాభై సంవత్సరాల అనుభవం ఉంది. మా మామగారిటైంలో బుక్ వర్క్ తప్ప ఇంకేం చేసి ఎరగదు మా ప్రెస్" అన్నాడు రంగనాథం ఇదో అభ్యంతరం కాదని క్షుణ్ణంగా తెలుసును గనుక.

"ఆ విషయం మీరు కొటేషన్లో రాయలేదట గదా?"

"జగమెరిగిన విషయం గనుక ప్రత్యేకించి రాయనిమాట నిజమేననుకోండి. వారు కావాలంటే పూర్వం అచ్చయిన పుస్తకాల నమూనాలు, ప్రశంసా పత్రాలు పంపుతాను రేపు."

"అలా అయితే ఫరవాలేదనుకుంటాను"

కమల ఊరుకుంటే బాగుండదని "మీరు ఎలాగయిన వారికి నచ్చచెప్పి ఈపని మావారికి వచ్చేటట్టు చూస్తారని నా నమ్మకం. మీరు తప్పకుండా ఈ సహాయం చేసి పెట్టాలి" అంది.

"అంతకంటేనా... కాని, చిన్న చిక్కు వున్నది..." అంటూ మధ్యలో ఆపేసింది శకుంతలాదేవి – ఆలోచిస్తున్నాను అన్నట్లుగా. చేతికి అందుతూ వున్న ఫలం జారిపోతోందా ఏమిటి అని భయం లాంటి ఆందోళన ప్రారంభం అయింది రంగనాథానికి.

"దేరీజ్ ఎ స్లిప్ బిట్వీన్ లిప్ అండ్ కప్" అన్న ఆంగ్ల అర్యోక్తి మనసులో మెదిలింది అతనికి.

"ఏమిటో చెప్పండి. వీలయితే సర్దుబాటు చేస్తాను..." అన్నాడు. మనసం ఎంత తాపత్రయ పడినా 'ప్రాప్తం వుంటేనే పనులు జరుగుతాయిగాని లేకపోతే యేమీ లాభం లేదని రంగనాథానికి బాగా తెలుసును.

శకుంతలాదేవి నింపాదిగా ప్రారంభం చేసింది.

"మీరు కోట్ చేసిన ధరకు మీ తరువాత తక్కువ ధరకు వ్యత్యాసం చాలా వుంది..."

అదేమిటో అర్థంకాలేదు రంగనాథానికి. తన ధర అన్నిటికన్నా తక్కువ అని ఫైల్లో వ్రాసివుండడం తన కళ్ళతోనే చూచాడు. తక్కువ ధర అయిన తర్వాత ఇంక ఆలోచన ఎందుకో అతనికి అవగాహన కాలేదు.

కమల కళ్ళల్లో చురుకుదనం చూచి మిన్నకుండి పోయాడు అప్పటికి.

కమల "ఊ... చెప్పండి..." అంది.

"మీరు లక్షాయాభై వేలు కోట్ చేశారట. ఇంకో కంపెనీ లక్షా డెబ్బయి ఐదువేలు కోట్ చేశారు. అంటే ఏకంగా పాతికవేల రూపాయలు వ్యత్యాసం"

తన ప్రాస్పెక్ట్ ఎందుకు భంగపడాలో ఇంకా అర్థంకాలేదు రంగనాథానికి. ఆమె వంక వెర్రిముఖం వేసుకు చూశాడు.

"మీకు తెలిసిందనుకుంటాను మీరు లక్షా అరవై వేలు కోట్ చేసినా ఈ టెండర్ మీకు రావడానికి ఏమీ అభ్యంతరంలేదు, తెలిసిందిగదూ!"

కమలకు అర్థం అయింది.

"మీ టెండరు కాగితంతీసి లక్షా యాభై వేల అంకెను లక్షా అరవై వేలుగా మార్చి సంతకం చేయండి. సరిపోతుంది" అంది రంగనాథంతో. శకుంతలాదేవి వంక తిరిగి "అంతేగదండీ మీరు చెప్పతున్నదీ?" అంది ఉత్సాహంగా.

రంగనాథం తటపటాయించాడు. అతనికి ఇదంతా కలలాగ వుంది. శకుంతలాదేవి టెండర్ ఫైలు ఆమెకు అందించింది సరీగా మార్పు చేయవలసిన కాగితం దగ్గర తెరచి వుంచి.

కమల చకచక టెండర్ కాగితంలో చేయవలసిన మార్పు చేసేసి కంపెనీ డైరెక్టర్‌గా తానే 'ఎటెస్ట్' కూడా చేసేసింది.

శకుంతలాదేవి నింపాదిగా "ఇప్పుడు ఇంకేం ఫరవాలేదనుకుంటాను. అయితే మీరు మాత్రం ఓ అయిదు వేలకు ఓపెన్‌చెక్ రాసి ఇచ్చేయండి" అంది.

కమల "చెక్ బుక్ తెచ్చారుగదా. వ్రాయండి" అంది.

రంగనాథం ఇప్పుడిప్పుడే ఈ ప్రపంచంలో పడుతున్నవాడి లాగా జిప్‌బాగ్‌లో నుంచి చెక్‌బుక్ బయటకుతీసి కలం తిప్పుతూ "గోవిందరాజుల గారి పేరనా?" అనడిగాడు.

శకుంతలాదేవి ముఖం చిట్లించుకుంటూ "కాదు, సెల్ఫ్ చెక్ వ్రాసి వెన కాల కూడా సంతకంచేయండి." అంది. ఇలాంటి ప్రాథమిక విషయాలలోకూడా సలహా ఇవ్వవలసి రావడం ఆమెకు చిరాకు తెప్పించినట్టుంది.

రంగనాథం చెక్ రాయబోతూ కమలతో "వెంటనే బ్యాంక్‌కు పంపితే బౌన్స్ అవుతుందిగదా! యెట్లా!" అన్నాడు.

శకుంతలాదేవి "ఫరవాలేదులెండి, టెండర్ మీకు ఎలాట్ చేయడంతోటే కంపెనీనించి కొంత ఎడ్వాన్స్ ఇస్తారు. ఆ చెక్ క్రెడిట్ చేశాకనే దీన్ని బాంకర్‌కు పంపుతాం" అంది.

రంగనాథం 'అమ్మయ్య' అనుకుని ఊపిరి పీల్చి వదిలాడు, ఆమెకు చెక్ అందచేసి.

శకుంతలాదేవికి "థాంక్స్" చెప్పేసి ఇద్దరూ ఇంటికి వచ్చేశారు.

ఓ గంట పోయిన తర్వాత రంగనాథం గదిలో టెలిఫోన్ "రింగ్" అయింది.

అవతలిపక్క గోవిందరాజులుగారి గొంతు: "చూడండి. ఓ పొరపాటు జరిగి నట్టుంది. లక్షా అరవయివేలకు మార్చమంటే కమలగారు లక్షా అరవయి అయిదువేలకు మార్చారు. టెండర్ ఫారం నేను ఇప్పుడే చూశాను. ఆ కాగితాలు.." అని పలికింది.

రంగనాథం బుర్ర క్షణంపాటు చురుగ్గాపనిచేసింది.

"అవునండీ, నా సమ్మతితోనే అలా మార్చింది. మీకేం అభ్యంతరం లేద నుకుంటాను" అన్నాడు.

"పెద్ద అభ్యంతరం లేదనుకోండి. ఓ వెయ్యి రూపాయలకు మరో సెల్ఫ్ చెక్ సంతకంచేసి పంపండి" అన్నాడు గోవిందరాజులు.

"అయిదువందలకు వ్రాసి పంపిస్తాను" అన్నాడు రంగనాథం. తను కూడా ఇంత ధైర్యంగా మాట్లాడ గలిగినందుకు క్షణమాత్రం నివ్వెరపోయినాడు.

"పోనీ ఏడు వందల యాభైకి వ్రాసి పంపించండి..." అన్నాడు గోవిందరాజులు అవతలి పక్కనించి.

"అలాగేనండి. థాంక్స్ ఒక అరగంటలో మీ ఇంటికి పంపుతున్నాను..." అని రంగనాథం మళ్ళీ థాంక్ చేసి రిసీవర్ క్రెడిల్ చేశాడు.

ఇక ఈ టెండర్ గురించి ఏమీ అనుమానంలేదు — అనుకున్నాడు. వెనుక నుంచి కమల 'ఇప్పటికయినా మీకు అర్థం అయిందా లోకం తీరు...?" అంది.

అర్థం అయింది అని ధైర్యంగా బదులు చెప్పలేక పోయినాడు రంగనాథం. అర్థం కాలేదని అనుకోవడానికి వీలులేని పరిస్థితి!